సాక్షి
విజయనగరం

శనివారం । 4 । మార్చి । 2023



ఘనంగా గంధ మహోత్సవం

వేలాది మంది భక్తులతో బాబామెట్ట పునీతమైంది. హజరత్ ఖాదర్‌వలీ బాబా పుణ్యక్షేత్రాన్ని దర్శించేందుకు బారులు తీరుతున్నారు. - IIలో



24 గంటల్లో విద్యుత్ కనెక్షన్

విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోగా విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్ మంజూరు చేస్తున్నారు. దరఖాస్తుదారుల్లో సంతోషం నింపుతున్నారు. - IIలో



ఉత్సాహంగా ఎడ్ల పరుగు

వేపాడ మండలం జాకేరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా జరిగింది. - IIలో

న్యూస్‌రీల్

ఖండ్యాంలో ఓంకారనాదం



శివాలయంలో ఒకేచోట ప్రతిష్ఠించిన ఐదు శివలింగాలు

రేగిడి: ఖండ్యాం గ్రామంలో ఓంకారనాదం మార్మోగింది. గ్రామంలోని ఉమా కాశీవిశ్వేశ్వర పంచాయతన క్షేత్రంలో మూడు రోజులుగా సాగుతున్న శిఖర కలశ పునఃప్రతిష్ఠోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో ఐదు శివ లింగాలను ఒకే చోట ప్రతిష్ఠించారు. అంపోలు రుద్ర కోటేశ్వర శర్మ, రామ్‌ప్రసాద్, గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పూజలు సాగాయి. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ఆడ పిల్లలపై వివక్ష చూపొద్దు



ర్యాలీ చేస్తున్న సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: ఆడపిల్లల పట్ల వివక్ష చూపొద్దని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి (డీఐఓ) డాక్టర్ జగదీష్ పేర్కొన్నారు. విజయనగరం కోట కూడలి వద్ద 'సేవ్ ది గర్ల్' అంటూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. లింగ వివక్ష చూపకుండా పిల్లలను పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో డెమో చిన్నతల్లి, హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్బలక్ష్మి, పవన్ ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగు పిల్ల జననం



కిమ్మి-నడుకూరు సమీపంలో తిరుగుతున్న ఏనుగులు

వీరఘట్టం: మండలంలోని కిమ్మి-నడుకూరు సమీపంలోని చెరకు తోటల్లో తిష్ట వేసిన ఏనుగుల గుంపులో ఒక ఏనుగు శుక్రవారం ఒక పిల్లకు జన్మనిచ్చిందని డీఆర్వో రవిబాబు తెలిపారు. గత పదిహేను రోజుల కిందట ఇక్కడకు ఏడు ఏనుగులు రాగా వీటిలో ఒక ఏనుగు విడిపోయి కొమరాడ-కురుపాం మండలాల వైపు వెళ్లింది. తాజాగా పుట్టిన పిల్లతో మళ్లీ ఏనుగుల సంఖ్య ఏడుకు చేరిందని డీఆర్వో తెలిపారు.

గోధుమ పిండి పంపిణీ

విజయనగరం అర్బన్: జిల్లాలోని తొమ్మిది మండలాల్లోని రేషన్ కార్డుదారులకు ఈ నెల నుంచి గోధుమ పిండి పంపిణీ చేస్తామని కలెక్టర్ సూర్యకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి, బొండపల్లి, గంట్యాడ, గుర్ల, నెల్లిమర్ల, రాజాం, రామభద్రపురం, సంతకవిటి, విజయనగరం మండలాల్లో ఒక్కో కార్డుకు రెండుకిలోల చొప్పున పంపిణీ చేస్తామని తెలిపారు. కిలో గోధుమ పిండికి కేవలం రూ.16 చెల్లిస్తే సరిపోతుందన్నారు. జిల్లాలో ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యంకు ఎక్కడైనా డబ్బులు వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు.

కొండగుంపాంలో కలెక్టర్ పర్యటన



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో కలెక్టర్ సూర్యకుమారి శుక్రవారం పర్యటించారు. ముందుగా స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించి ఎనిమిదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ట్యాబ్‌ల వినియోగంపై ఆరా తీశారు. అనంతరం పదోతరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పక్కనే ఉన్న సచివాలయాన్ని సందర్శించి సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణరాజు, ఎంపీడీఓ గిరిబాల, ఎంఈఓ కృష్ణారావు పాల్గొన్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో...
విజయనగర వాణి

- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో విజయవంతం
- భారీగా వస్తున్న పెట్టుబడులతో ఉమ్మడి విజయనగరం జిల్లాలకు ప్రయోజనం
- రాజాంకు చెందిన పారిశ్రామికవేత్త జీఎంఆర్‌కు వేదికపై పెద్దపీట
- భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ప్రస్తావన
- తొలిదశలో రూ.5వేల కోట్లతో 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యంతో నిర్మాణం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పాల్గొన్న ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా విశాఖలో తలపెట్టిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ తొలిరోజు శుక్రవారం విజయవంతమైంది. ఈ సమ్మేళనం ద్వారా లక్షల కోట్ల పెట్టుబడులు రావడానికి తొలి అడుగు పడింది. విశాఖ త్వరలోనే రాష్ట్ర పరిపాలనా రాజధాని అవుతుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇదే వేదికపై స్పష్టం చేశారు. విశాఖకు భవిష్యత్‌లో జంట నగరంగా అభివృద్ధి చెందుతున్న విజయనగరానికి ఇది శుభవార్తే. అలాగే, విజయనగరం జిల్లాలో భోగాపురం వద్ద ఇంటర్నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణం దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం, పునరాసం తదితర పనులన్నీ పూర్తయిన నేపథ్యంలో త్వరలోనే శంకుస్థాపన జరిగే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని జీఎంఆర్ గ్రూప్స్ అధినేత, రాజాంకు చెందిన పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వేదికపై స్పష్టం చేశారు. ఏటా 4 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకల సామర్థ్యమంటే ఈ విమానాశ్రయం ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు. తొలిదశలో రూ.5వేల కోట్ల పెట్టుబడితో 60 లక్షల మంది రాకపోకలకు వీలుగా ఎయిర్‌పోర్టు నిర్మితం కానుందని జీఎం రావు వెల్లడించారు. ఫిషరీస్, ఫార్మా తదితర ఉత్పత్తుల ఎగుమతులకు అనుగుణంగా ప్రత్యేక కార్గో సౌకర్యం కూడా కల్పించనున్నట్టు చెప్పారు. తద్వారా ఫార్మా, ఫిషరీష్ కంపెనీలు జిల్లాకు మరిన్ని రావడానికి అవకాశం ఏర్పడుతుంది. విమానాశ్రయం సమీపంలోనే ఐటీ సిటీ నిర్మాణానికి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, ఢిల్లీలో బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు మాదిరిగా ఆ రెండు చోట్ల సౌకర్యాల సమాహారంగా భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణం ఉంటుందని జీఎం రావు చెప్పడం విశేషం. తద్వారా జిల్లాలో హోటళ్లు ఇతరత్రా సేవారంగం, పర్యాటక రంగం కూడా భారీఎత్తున విస్తరించే అవకాశం ఉంది. ప్రముఖ పారిశ్రామికవేత్తలు తరలివచ్చిన ఈ సమ్మేళనం ఉమ్మడి విజయనగరం జిల్లాలకు ఎన్నో ప్రయోజనాలను తీసుకురానున్నందని హర్షధ్వానాలు వ్యక్తమవుతున్నాయి. జీఎం రావుకు ఈ వేదికపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం కల్పించడం విశేషం.

జగన్ ఓ సమ్మోహన శక్తి



జగన్‌మోహన్‌రెడ్డి పేరు కాదు.. ఓ సమ్మోహన శక్తికి బ్రాండ్. అంబానీ, బిర్లా వంటి కార్పొరేట్ దిగ్గజ ప్రముఖులు సదస్సులో పాల్గొనడం శుభపరిణామం. లక్షల కోట్ల పెట్టుబడులతో ఏర్పడనున్న కంపెనీల వల్ల స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు విరివిగా లభిస్తాయి. ఆసియా ఖండంలో అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న, సహజసిద్ధ ప్రకృతి అందాలు అదనపు ఆకర్షణగా ఉన్న విశాఖపట్నంకు పరిపాలనా రాజధాని చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. సమ్మిట్ విషయంలో జనసేన నాయకుడు పవన్‌క ళ్యాణ్ చేసిన సూచనలను స్వాగతిస్తున్నాం.

– పీడిక రాజన్నదొర, డిప్యూటీసీఎం

ఉమ్మడి విజయనగరానికి మేలు...



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023లో మన ప్రాంత పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావుకు ముఖ్యమంత్రి ప్రాధాన్యమివ్వడం స్థానిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా ఉంది. విశాఖపరిపాలనా రాజధాని కావడం, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ఉమ్మడి విజయనగరం జిల్లాకు మేలు జరుగుతుంది.

– కోలగట్ల వీరభద్రస్వామి, ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్

ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదం...



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో ఉత్తరాంధ్రలో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు తీస్తుంది. విశాఖను రాజధానిగా ప్రకటించడంతోనే ఇది సాధ్యపడింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో విజయనగరం జిల్లా అన్నిరంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తుందనడంలో సందేహం లేదు.

– డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్సీ

ఆంధ్రా వైపు పారిశ్రామికవేత్తల చూపు!

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఒక కలికితురాయి.. చరిత్రలో ఇదొక శుభపరిణామంగా నిలిచిపోతుందని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. రాజాంలో ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారమే విశాఖను రాష్ట్ర పరిపాలనా రాజధానిగా చేస్తున్నారని చెప్పారు. దేశంలో దిగ్గజ పారిశ్రామికవేత్తలు, అనేక కంపెనీల సీఈవోలు, 47 దేశాలకు చెందిన కంపెనీల ప్రతినిధులు సమ్మిట్‌కు హాజరయ్యారంటే ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చన్నారు. గతంలో ఎప్పుడూ ఇటువైపు చూడనివారంతా ముఖ్యమంత్రిపై నమ్మకంతో సమ్మిట్‌కు హాజరయ్యారని చెప్పారు. ఇలాంటి పారిశ్రామిక దిగ్గజాల మధ్య విశాఖపట్నం రాష్ట్ర పరిపాలనా రాజధానిగా అవుతుందని చెప్పడం ఈ ప్రాంత వాసులందరూ ఆనందించదగ్గ విషయమన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో ఉత్తరాంధ్ర నిర్వీర్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కుట్రలు, కుతంత్రాలు, మోసపూరిత విధానాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ముకాయడంతోనే ఆనాడు పారిశ్రామికవేత్తలు ముందుకురాలేదని విమర్శించారు. సుమారు 6 లక్షల మంది యువతకు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ సమావేశంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాలకు శుభ పరిణామం



విశాఖపట్నంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో ఉత్తరాంధ్ర జిల్లాలకు ఎంతోమేలు జరగనుంది. విశాఖపట్నంలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తామని గ్లోబల్ సమ్మిట్ వేదికగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. అదే వేదికపై నుంచి భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని ప్రముఖ పారిశ్రామికవేత్త జీఎంఆర్ వెల్లడించారు. దీంతో పాటు ఎన్‌టీపీసీ ,రిలయన్స్ వంటి సంస్థలు మినరల్ ఎనర్జీ, రిలయబుల్ ఎనర్జీ ప్లాంట్ నిర్మాణానికి ముందుకు వచ్చాయి. పోలవరం ప్రాజెక్టుకు నిధులు సహకార అందిస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్ర జిల్లాలు సస్యశ్యామలమవుతాయి.

– బెల్లాన చంద్రశేఖర్, ఎంపీ

యువతకు ఉద్యోగ అవకాశాలు



భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తయితే జిల్లాలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఈ జిల్లా అభివృద్ధికి నిరంతరం ఆలోచిస్తున్నారని చెప్పడానికి ఇదే నిదర్శనం.

– బొత్స అప్పలనరసయ్య, గజపతినగరం ఎమ్మెల్యే

జగన్ కృషితో పరిశ్రమల రాక



రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పడుతున్న శ్రమే పరిశ్రమల రాకకు నిదర్శనం. పరిపాలనా రాజధానిగా విశాఖను ఎంచి, ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న జగన్ మీద నమ్మకంతోనే పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారు. పారిశ్రామికవేత్తల సదస్సు విజయవంతంతో పసలేని ప్రతిపక్షాల, పచ్చపత్రికల అబద్ధపు ప్రచారానికి తెరపడింది.

– శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, ఎమ్మెల్యే, బొబ్బిలి

పెట్టుబడుల్లోనూ నాడు-నేడు...



నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం జగన్. విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు పారిశ్రామిక దిగ్గజాలు ఆయన పాలనపై నమ్మకంతో వచ్చారు. ఈరోజు రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం. 20 రంగాల్లో పెట్టుబడులతో 6 లక్షల మందికి ఉపాధి కల్పించేలా సరికొత్త పారిశ్రామిక విధానంతో వచ్చి టీడీపీ నేతల నోటికి తాళం వేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా మూడేళ్లు ప్రథమ స్థానంలో రాష్ట్రాన్ని నిలిపారు. సమ్మిట్ సూపర్‌హిట్. బడులలోనే కాదు పెట్టుబుల్లోనూ నాడు-నేడూ చూపారు జగన్. విశాఖ నుంచి పాలన ఉంటుందని చెప్పిన ఆయనకు ధన్యవాదాలు.

– కడుబండి శ్రీనివాసరావు, ఎస్.కోట ఎమ్మెల్యే

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

విజయనగరం అర్బన్: వచ్చేనెల 3 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూర్యకుమారి ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో తన చాంబర్లో శుక్రవారం సమీక్షించారు. జిల్లాలోని 127 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 24,099 మంది రెగ్యులర్, 1,428 మంది ప్రైవేటు విద్యార్థులకు పరీక్షలు రాయనున్నట్టు వెల్లడించారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్లు, ఎంపీడీఓలు తనిఖీ చేసి ప్రతి రోజు నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలయ్యేలా చూడాలన్నారు. పరీక్షల పర్యవేక్షణకు 9 ఫ్లైయింగ్ స్క్వాడ్లను నియమించామన్నారు. ప్రశ్న పత్రాల కస్టోడియన్‌గా జిల్లా రెవెన్యూ అధికారి వ్యవహరిస్తారని చెప్పారు. సమాధాన పత్రాల మూల్యాంకనం పూర్తయ్యేవరకు స్ట్రాంగ్‌రూమ్‌కు పోలీసులు బందోబస్తుగా ఉండాలన్నారు. తాగునీరు, వైద్యసేవలతో పాటు పరీక్ష సమయంలో ఆర్టీసీ బస్సులు నడిపేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్వో గణపతిరావు, డీఈఓ లింగేశ్వరెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రమణకుమారి, డీఎస్పీ శేషాద్రి, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీకుమారి, విద్యుత్‌శాఖ ఎస్ఈ, డిప్యూటీ డీఈఓలు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువతపాత్ర కీలకం



పరిశోధన పత్రికను విడుదల చేసిన ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ బీఎస్‌మూర్తి

- పరిశోధనలకు నేషనల్ ఆన్‌లైన్ పోర్టల్
- జేఎన్‌టీయూ జీవీలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

విజయనగరం అర్బన్: దేశాభివృద్ధికి ప్రతిభావంతులైన యువత పాత్ర కీలకమని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ బీఎస్‌మూర్తి పేర్కొన్నారు. పరిశోధన దృక్పథాన్ని మెరుగుపరచుకునేందుకు నేషనల్ ఆన్‌లైన్ పోర్టల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మెటలర్జికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ (ఐసీఏఎంఎంపీ- 2023)' అనే అంశంపై రెండురోజుల పాటు నిర్వహించే అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిరంతర విద్యార్థిగా అధ్యయనం చేయాలన్నారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఉద్యోగావకాశాలకు మెటలర్జికల్ రంగం కీలకమని, మెటీరియల్ లేనిదే వస్తు తయారీ రంగం లేదన్నారు. గతంలో పోలిస్తే ప్రతి వస్తువు పరిణామం తగ్గుతూ వస్తుండడం గమనించాలని, దీనికి నానో మెటీరియల్ ఇంజినీరింగ్ ప్రవేశమే కారణమన్నారు. సదస్సు చైర్మన్ అండ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు మాట్లాడుతూ మొదటి ఐసీఏఎంఎంపీ సదస్సు 2017లో జరిగిందని, దానికి వచ్చిన స్పందన ఆధారంగా ఈ సదస్సును నిర్వహించామన్నారు. ప్రపంచవ్యాప్తంగా వంద మందికి పైగా తమ పరిశోధనా పత్రాలను ప్రదర్శించేలా రూపకల్పన చేశామని వివరించారు. అనంతరం ప్రొఫెసర్ బీఎస్‌మూర్తి ఎడిటర్‌గా రూపొందించిన పరిశోధనా పత్రికను ఆవిష్కరించారు. సదస్సులో గౌరవ అతిథులుగా ఐఐటీ హైదరాబాద్ డిస్టింగ్విష్డ్ ప్రొఫెసర్ డాక్టర్ భానుశంకరరావు, ఎన్‌ఐసీ కెనడా చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ప్రకాశ్ పట్నాయక్, ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఆర్ఐఎన్ఎల్ విశాఖ డైరెక్టర్ అరుణ్ కాంతి బగాచి, టల్లిన్ యూనివర్సిటీ ఇస్టోరియా ప్రొఫెసర్ కేజీప్రశాంత్, టాటా స్టీల్ సౌత్ హెడ్ సూర్యనారాయణ రెడ్డి, పరిశోధకులు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇటుకలతో ఉపాధి

- జిల్లాలో జోరుగా ఇళ్ల నిర్మాణాలు
- ఇటుకలకు పెరిగిన డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా 1200లకు పైగా ఇటుక పరిశ్రమలు
- 2 వేల ఇటుకల ధర రూ.10 వేలు
- తేలికపాటి ఇటుకలకు గిరాకీ
- వేలాదిమందికి ఉపాధి



రంగారాయపురంలో ఇటుకల తయారీలో నిమగ్నమైన కూలీలు

రాజాం:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా అమలుచేసిన 'పేదలందరికీ ఇళ్లు' పథకం వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి చూపుతోంది. భవన నిర్మాణ కార్మికులతో పాటు నిర్మాణ సామగ్రికి డిమాండ్ పెరిగింది. ఊరూరా వెలసిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జోరందుకోవడం, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు, ఆర్‌బీకేలకు సొంత భవనాల నిర్మాణాలతో ఇటుకలకు గిరాకీ నెలకుంది. వ్యాపారం జోరందుకుంది. పరిశ్రమలో పనిచేస్తున్న వారికి చేతినిండా పనిదొరుకుతోంది.

లోడు ధర రూ.10వేలు..

సాధారణంగా ఒక ఇంటి నిర్మాణానికి 10 వేల నుంచి 25 వేలు (5 నుంచి 13 లోడ్‌లు) ఇటుకలు అవసరం. ప్రస్తుతం ట్రాక్టర్ లోడ్ ధర (2 వేల ఇటుకలు) రూ.9వేల నుంచి రూ.10వేలు పలుకుతోంది. తేలికపాటి ఇటుకలకు మరో రెండు మూడు వేలు అధికంగా చెల్లించాల్సిందే. నాగావళి, వేగావతి, సువర్ణముఖి, చంపావతి నదీ తీరాల్లో మంచి మట్టి దొరుకుతుండడంతో ఇటుక పరిశ్రమలు విస్తారంగా వెలిశాయి. జిల్లాలో 1200 ఇటుక పరిశ్రమలు ఉన్నట్టు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. రూ.కోట్లలో వ్యాపారం సాగుతోంది.

వేలాది మందికి జీవనాధారం

ఇటుక పరిశ్రమ జిల్లాలోని వేలాదిమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారంగా మారింది. ఒక్కో ఇటుక బట్టీ వద్ద 14 మంది కూలీలు పనిచేస్తున్నారు. వీరు నెలవారీ వేతనం, కాంట్రాక్టు (ఇటుకల తయారీ లెక్కన) ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ప్రత్యక్షంగా ఆరు నుంచి ఏడు కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఒక్కో కూలి నెలకు రూ. 20 వేలకుపైగా ఆర్జిస్తున్నారు. వీటిని తరలించే ట్రాక్టర్ల యజమానులకు మంచి డిమాండ్ ఉంది. ఒక ట్రాక్టర్ లోడ్ తరలిస్తే ఖర్చులు పోను రూ.1000వరకు మిలుగుతోందని ట్రాక్టర్ యజమానులు చెబుతున్నారు. ట్రాక్టర్‌కు ఇటుకలు ఎక్కించడం, దించేందుకు ముగ్గురు నుంచి నలుగురు కూలీలు అవసరం. ఇటుకలకు డిమాండ్ పెరగడంతో వీరందరికీ రోజంతా పనిదొరుకుతోంది.

డిమాండ్ పెరిగింది



ఇటుకల తయారీని వేగవంతం చేశాం. మా వద్ద ప్రస్తుతం 2 లక్షల ఇటుకలు ఉన్నాయి. వీటికి అడ్వాన్స్ ఇచ్చారు. రెండు రోజుల్లో తీసుకువెళ్తామని చెప్పారు. కొత్తగా ఇటుకల తయారీ ప్రారంభించాం. ఇళ్లనిర్మాణాలతో డిమాండ్ పెరిగింది.

– దంగేటి వీరస్వామి, ఇటుకలతయారీదారు, పీజేపేట, సంతకవిటి మండలం

ఒండ్రు మట్టి ఇటుకలకు డిమాండ్



ఒండ్రు మట్టి ఇటుకలకు మంచి డిమాండ్ ఉంది. మా వద్ద ఎక్కువగా లైట్ వెయిట్ ఇటుకలు తయారవుతాయి. వీటికి నిత్యం డిమాండ్ ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడంతో మా వ్యాపారం జోరందుకుంది.

– డి.బుచ్చయ్య, ఇటుకల తయారీయూనియన్ నాయకుడు, రాజాం

మంచి ఉపాధి



ఇటుకల పరిశ్రమతో మాకు ఉపాధి లభిస్తోంది. మగవారితో సమానంగా వేతనాలు లభిస్తున్నాయి. ప్రస్తుత సీజన్‌లో ప్రతీనెల రూ. 20 వేలు వరకూ ఆదాయం వస్తోంది. ఆగస్టు నెల వరకు ఇటుకలకు డిమాండ్ ఉంటుంది.

– మూడడ్ల ఇందుమతి, ఇటుక పరిశ్రమ కూలీ, లచ్చారాయపురం, రేగిడి మండలం

సమయపాలన తప్పనిసరి

విజయనగరం ఫోర్ట్: పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 48 పీహెచ్‌సీల్లో 24 గంటల పాటు విధిగా రోగులకు వైద్య సేవలు అందజేయాలన్నారు. ఎవరైనా విధులకు సక్రమంగా హాజరు కాకపోయినా, సమయపాలన పాటించకపోయినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

పది ఎకరాల్లో జీడి తోట దగ్ధం


కాలిపోతున్న జీడితోటలు

కురుపాం: కురుపాం మేజర్ పంచాయతీ పరిధిలోని హుకుంపేట గిరిజన గ్రామానికి చెందిన సోములు, సూరమ్మ, ఆర్.తాతబాబు, త్రినాథ్, పార్వతమ్మలకు చెందిన సుమారు పది ఎకరాల జీడి తోట శుక్రవారం దగ్ధమైంది. మరో నెల రోజుల్లో చేతికి అందనున్న పంట అగ్నికి ఆహుతైందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణం తెలియరాలేదని కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

13న 50 వాహనాలకు పోలీస్ శాఖ వేలం

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖ వినియోగించి, కాలం చెల్లిన 50 వాహనాలను ఈ నెల 13న ఈ వేలం వేయనున్నట్లు ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్‌శాఖ వినియోగించిన 50 వాహనాలను ఏడు లాట్లుగా విభజించామని, వాహనాల వేలం ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన బిడ్డర్లు వెబ్‌సైట్‌ను సంప్రదించి, బిడ్డింగ్ వేయాలని పిలుపునిచ్చారు. వేలం వేయాల్సిన 50 పోలీసు వాహనాలు ప్రస్తుతం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉన్నాయని, ఆసక్తి కలిగిన వేలందారులు ఎంటీఓ ఎల్.శ్రీనివాసరావు ఫోన్ నంబర్ 9121109486, మెకానిక్ ఫోన్ నంబర్ 9440070857లను సంప్రదించి వాహనాలను పరిశీలించుకోవచ్చునని ఎస్పీ సూచించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



గుమడలో అక్రమంగా నిల్వ చేసిన బియ్యం

కొమరాడ: మండలంలోని గుమడ గ్రామం చందక వీధిలో గ్రామస్తుడు వడ్డీ చంద్ర ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారి ఎ.సురేష్ బాబు ఆదేశాల మేరకు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం దాడులు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడుల్లో 2170 కిలోల బియ్యం పట్టుబడ్డాయని, బియ్యం విలువ రూ.82,460 ఉంటుందని తెలిపారు. పీడీఎస్ బియ్యం లబ్ధిదారుల నుంచి సేకరించి అక్రమంగా నిల్వ ఉంచిన వడ్డీ చంద్రపై కేసు నమోదు చేసి పౌర సరాఫరాల శాఖ అధికారులకు అప్పగించామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

భర్త ఆచూకీ తెలపాలంటూ భార్య ఫిర్యాదు


కోల మోహన కృష్ణ

జియ్యమ్మవలస: తన భర్త ఆచూకీ తెలపాలంటూ మండలంలోని చిన మేరంగి గ్రామానికి చెందిన కోల తులసిరాణి శుక్రవారం జియ్యమ్మవలస,పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు ఎస్సై కళాధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చినమేరంగి గ్రామానికి చెందిన తులసిరాణికి 2009వ సంవత్సరంలో శ్రీకాకుళంలోని కొన్నవీధికి చెందిన కోల మోహన కృష్ణతో పెళ్లి అయింది. ప్రస్తుతం వారు పార్వతీపురం మైదానం వీధిలో కర్రీ పాయింట్ నడుపుతున్నారు. దగ్గర బంధువు పెళ్లికి బుధవారం భర్తతో కలిసి చినమేరంగి గ్రామానికి ఆమె వచ్చింది. తన భర్తకు గతంలో ఫిట్స్ వచ్చాయని, బంధువులను దిగబెట్టి వస్తానని చెప్పి సాయంత్రం వెళ్లి ఇంతవరకు రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 912109478 నంబర్‌కు తెలియపరచాలని ఎస్సై కోరారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹117	₹204	₹ 214

ఘనంగా గంధ మహోత్సవం

- కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రావణి


కార్యక్రమంలో పాల్గొన్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



బాబా చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం టౌన్: వేలాది మంది భక్తులతో బాబామెట్ట పునీతమైంది. హజరత్ ఖాదర్‌వలీ బాబా పుణ్యక్షేత్రాన్ని దర్శించేందుకు బారులు తీరుతున్నారు. శుక్రవారం దర్బార్‌లో నిర్వహించిన గంధ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దర్గాలో పవిత్ర ఖురాన్ పఠనంతో ఉత్సవం ప్రారంభమైంది. దర్బార్ వారసులు సజ్జాద్ నషీన్ మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా ఖాదరీ బాబా దర్గా, దర్బార్ ముతావలి డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్, ఎం.డి జాఫర్ షరీఫ్ ఉర్సు మహోత్సవాన్ని ప్రారంభిస్తూ, దర్బార్‌లో ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. అనంతరం ఫకీర్ మేళాతో ఊరేగింపుగా, మేళతాళాల నడుమ బాబా వారి చాదర్, అత్తరు, పూలమాలలతో దర్గాకు కోలాహలం మధ్య వచ్చి దర్బార్‌లోని ఆనాటి బాబా చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై నిలిపారు. భక్తుల కోలాహలం మధ్యన బాబాకు చాదర్ సమర్పించి, జెండా మహోత్సం నిర్వహించారు. పురవీధుల్లో రథంపై ఆశీనులైన బాబా భక్తులను ఆశీర్వదించారు. కోలాటం, తప్పెటగుళ్లు, పులివేషాలు, బ్యాండ్ పార్టీలతో నగరవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. సుమారు 60వేల మంది భక్తులు లంగర్ ఖానాలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మతసామరస్యానికి ప్రతీక

మతసామరస్యానికి ప్రతీక మన విజయనగరమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం బాబామెట్టలోని రెడ్డిబాబా ఆధ్వర్యంలో సర్వేయర్ కుమార్ నివాసం నుంచి చందన్ ఊరేగింపును ఆమె ప్రారంభించారు. బాబా చిత్రపటానికి పూలమాలలేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వమానవాళికి అద్భుతమైన సందేశాన్ని హజరత్ ఖాదర్ వలీ బాబా అందించారన్నారు.

పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌ఓల సేవలు

- అధికారుల సమావేశంలో కలెక్టర్ సూర్యకుమారి


మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజున బీఎల్‌ఓల సేవలను పోలింగ్ స్టేషన్ల వద్ద వినియోగించుకోవాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అధికారులకు సూచించారు. అందుకు సంబంధించి తహసీల్దార్లకు ఇప్పటికే సర్క్యులర్ జారీ చేశామని చెప్పారు. చాలెంజ్ ఓట్లు, ఓటర్లను గుర్తించడానికి, ఓటింగ్ ప్రశాంతంగా జరగడానికి వారి సేవలను వినియోగించాలని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జోనల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన తర్వాత ఏర్పాట్లపై వారి అభిప్రాయాలను స్వీకరించారు. ఓటరు ఎవరైనా పోలింగ్ బూత్‌లోకి ఎటువంటి మొబైల్ ఫోన్ కానీ, కెమెరా కానీ తీసుకు వెళ్లకూడదని స్పష్టం చేశారు. వీవీపీలు ఓటింగ్‌కు వచ్చేటప్పుడు వారి సెక్యూరిటీలు, పీఏ డైరీ రాసేలా చూడాలని జోనల్ అధికారులకు సూచించారు. ఎన్నికల విధులలో ఉన్న అధికారులంతా పోస్టల్ బాలెట్ కోసం దరఖాస్తు చేసుకుని ఓటును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

48 గంటల పాటు డ్రై డే

పోలింగ్ 13వ తేదీన జరగనున్నందున 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలి. డ్రై డేగా పాటిస్తూ ఉత్తర్వులను జారీ చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

బాలసదన్ విద్యార్థులకు అస్వస్థత

- కలుషిత ఆహారం వల్ల వాంతులు
- ఆస్పత్రికి తరలింపు


వాంతులు చేసుకుంటున్న పిల్లలు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని బాలసదన్‌లో ఉంటున్న పిల్లలు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు.శుక్రవారం రాత్రి పిల్లలకు బాలసదన్‌లో గుడ్డు ఉక్కురు పెట్టారు. అది తిన్న వెంటనే విద్యార్థులంతా ట్యాప్ దగ్గరికి వెళ్లి వాంతులు చేసుకుని ఇబ్బంది పడ్డారు. బాలసదన్‌లో ఉన్న 12 మంది విద్యార్థులు వాంతులు చేసుకున్న విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి బి. శాంతకుమారి బాలసదన్‌కు చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులకు ఏం పెట్టారు? ఎందువల్ల వాంతులయ్యాయని సిబ్బందిని ఆరా తీశారు.

పరామర్శించిన అప్పారావు

బాలసదన్ పిల్లలు అస్వస్థతకు గురయ్యారని తెలియగానే రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కేసలి అప్పారావు బాలసదన్‌కు చేరుకుని పిల్లలను పరామర్శించారు. సంఘటన గురించి సిబ్బందిని ఆరా తీశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి బి. శాంతకుమారిని ఆదేశించారు. అనంతరం పిల్లలను జిల్లా కేంద్రాస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

రేషన్ డిపోల్లో విజిలెన్స్ తనిఖీలు

- రెండు 6ఎ కేసుల నమోదు


కోఆపరేటివ్ స్టోర్‌లో ఉన్న రేషన్‌డిపోలో సోదా చేస్తున్న అధికారులు

శృంగవరపుకోట: పట్టణంలో ఉన్న చౌకధరల దుకాణాల్లో విజిలెన్స్ సీఐ బి.సింహాచలం శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కో ఆపరేటివ్ స్టోర్స్‌లో నిర్వహిస్తున్న రేషన్ డిపోలు, నంబర్ 133, 128లలో సోదాలు నిర్వహించగా 133వ నంబర్ డిపోలో 601కిలోల బియ్యం, 24.5కిలోల పంచదార, 128వ నంబర్ డిపోలో 6472కిలోల బియ్యం , మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన కందిపప్పు 2కిలోలు, పంచదార 25కిలోలు తక్కువ ఉన్నట్టు అధికారులు నిర్ధారించారు. దీంతో డీలర్లు సనివాడ అప్పారావు, సనివాడ గోవిందలపై 6ఎ కేసులు నమోదు చేశారు. అనంతరం ఆయా డిపోల నిర్వహణను డిపో నంబర్ 208 డీలర్ కె.రాణికి అప్పగించారు. సోదాల్లో సీఎస్‌డీటీ ఎస్‌వీవీఎస్ మూర్తి, వీఆర్వో రమణ తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత


బీమా నగదును అందజేస్తున్న డీసీసీబీ సీఈఓ జనార్దన్, చైర్మన్ శ్రీనివాసరావు

గుర్ల: మూడు నెలల క్రితం రైలు ప్రమాదంలో మరణించిన మండలంలోని జమ్ము గ్రామానికి చెందిన జమ్ము సీతంనాయుడు కుటుంబానికి జమ్ముపేట సొసైటీ కార్యాలయం బీమా నగదు అందజేసింది. సీతంనాయుడు జమ్ముపేట సొసైటీలో రుణం తీసుకున్న సమయంలో సిబ్బంది బీమా పథకంలో చేర్పించారు. సీతంనాయుడు మృతి చెందడంతో వచ్చిన బీమా నగదురూ.లక్షను మృతుని కుమారుడు రమేష్‌కు డీసీసీబీ సీఈఓ కె.జనార్దన్, జమ్ము సొసైటీ చైర్మన్ కురుమునెల్లి శ్రీనివాసరావు శుక్రవారం జమ్ము సొసైటీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డీసీసీబీలో బీమా పాలసీ తీసుకోవాలని సూచించారు.

మైనింగ్ ఏరియా సర్వే పరిశీలన


సర్వేపై సూచనలు ఇస్తున్న డీఎఫ్‌ఓలు

సాలూరు: మండలంలోని తోణాం బీట్ పరిధిలో పూతికవలస మైనింగ్ ఏరియాలో శుక్రవారం ప్రారంభించిన సర్వేను విజయనగరం, పార్వతీపురం డీఎఫ్‌ఓలు వెంకటేష్, ప్రసూనలు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ ప్రాంతం అటవీశాఖ పరిధిలోనిదని ఆ శాఖ అధికారులు, అటవీశాఖపరిధిలోనిది కాదని మైనింగ్ లీజుకు తీసుకున్న యజమానుల మధ్య గతంలో న్యాయస్థానంలో వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని సర్వే చేయాలని సర్వే ఆఫ్ఇండియా ఆదేశించినట్లు సాలూరు ఫారెస్ట్‌రేంజ్ అధికారి రామారావు తెలిపారు. ఈ నెల 11 వరకు ఈ సర్వే ఉంటుందని అన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు


గాయాలపాలైన బంగారు నాయుడు

జామి: మండలంలోని పోతనపల్లి గ్రామానికి చెందిన బి.బంగారు నాయుడు (43) బైక్‌పై జామి వైపు వస్తుండగా మండల కేంద్రం జామి మాధవరాయి మెట్ట కాలనీ వద్ద లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన బంగారు నాయుడిని 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు.

24గంటల్లో విద్యుత్ కనెక్షన్

- ఈఏడాది కొత్త గృహ విద్యుత్ కనెక్షన్లు 2వేలు మంజూరు
- దరఖాస్తు చేసిన వెంటనే స్పందిస్తున్న అధికారులు


విజయనగరం పట్టణంలో నూతనంగా నిర్మించిన ఇంటికి మీటరు బిగిస్తున్న విద్యుత్‌శాఖ ఉద్యోగి

విజయనగరం ఫోర్ట్: అయ్యన్నపేట ఉద్యోగుల కాలనీలో పప్పల రమేష్ నాయుడు నూతనంగా నిర్మించుకున్న ఇంటికి విద్యుత్ వైరింగ్ అంతా పూర్తి చేసి కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తు చేసిన 24 గంటల్లో ఆయనకు విద్యుత్ కనెక్షన్‌ను అధికారులు మంజూరు చేశారు.

- గంట్యాడ మండలం పెదవేమలి గ్రామానికి చెందిన పి.సత్యం నూతనంగా నిర్మించుకున్న తన ఇంటికి విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆయనకు కూడా దరఖాస్తు చేసిన 24 గంటల్లో విద్యుత్ కనెక్షన్ మంజూరు చేశారు. వారిద్దరికే కాదు. వేలాది మందికి గృహ విద్యుత్ కనెక్షన్లను విద్యుత్ శాఖ అధికారులు మంజూరు చేశారు.
- విద్యుత్ కనెక్షన్ కావాలంటే గతంలో రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి. అయితే ప్రస్తుతం గతానికి భిన్నమైన పరిస్థితి ఉంది. విద్యుత్ కనెక్షన్ కావాలని దరఖాస్తు చేస్తే చాలు 24 గంటల్లో మంజూరు చేస్తున్నారు. ఈ ఏడాది గృహ విద్యుత్ కనెక్షన్లు 2 వేలు మంజూరు చేశారు.

దరఖాస్తు చేసిన వెంటనే కనెక్షన్



వైరింగ్ అంతా పూర్తయిన ఇళ్లకు దరఖాస్తు చేసిన వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇచ్చేస్తున్నాం. లైన్‌తో వేయాల్సిన కనెక్షన్‌కు మాత్రం కొద్ది రోజుల సమయం పడుతుంది. విద్యుత్ కనెక్షన్ వెనువెంటనే మంజూరు చేసేలా ఆదేశాలు ఇచ్చాం.

– పి.నాగేశ్వరావు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ

నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి

- డీఆర్‌ఓ వెంకటరావు


మాట్లాడుతున్న డీఆర్‌ఓ వెంకటరావు

పార్వతీపురం: శాసన మండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి జిల్లాలో రూ.10 లక్షలకు మించి నగదు లావాదేవీలు నిర్వహించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని పార్వతీపురం మన్యం జిల్లా డివిజనల్ రెవెన్యూ అధికారి జల్లేపల్లి వెంకటరావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ఇన్‌కం ట్యాక్స్ అధికారులు, నోడల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాదారులు రూ.10 లక్షలకు మించి పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరిపిన వారి వివరాలను బ్యాంక్ అధికారుల నుంచి బాబితా సేకరించి విచారణ జరపాలని కోరారు. అలాగే తక్కువ నగదు రూపంలో ఎక్కువ సార్లు లావాదేవీలు నిర్వహించే వారిపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతిఒక్కరూ ఎన్నిలకల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌కంటాక్స్ అధికారులు కె. రవిశంకర్, జి.రమణ, పరిపాలన అధికారి ఉమామహశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓ మానవత్వం


క్షతగాత్రుడి తలకు కట్టు కడుతున్న వీఆర్‌ఓ రఘునాయుడు

వీరఘట్టం: ద్విచక్రవాహనంపై వెళ్తూ గాయాల పాలైన ఓ వ్యక్తిని చూసి స్పందించిన వీఆర్‌ఓ మానవత్వంతో బాధితుడికి సపర్యలు చేసి ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి. వీరఘట్టం-పాలకొండ రోడ్డులో చిదిమి జంక్షన్ వద్ద అదుపు తప్పి శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆ సమయంలో వీరఘట్టం నుంచి తన స్వగ్రామం బొడ్లపాడుకు కారులో వెళ్తున్న వీఆర్‌ఓ పొన్నాడ రఘునాయుడు రోడ్డు పక్కన ఉన్న క్షతగాత్రుడిని చూసి వెంటనే కారు ఆపి కిందికి దిగి సపర్యలు చేశారు. తలకు గాయమై రక్తస్రావం అవుతుండడంతో వీరఘట్టంలోని ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందజేశారు. రోడ్డు ప్రమాదం జరిగి చాలా సమయం అయినప్పటికీ అటువైపుగా వెళ్లిన ఎవరూ వాహనాలు ఆపలేదని, వీఆర్‌ఓ రఘునాయుడు మానవత్వంతో తనకు సపర్యలు చేయడంపై క్షతగాత్రుడు కృతజ్ఞతలు తెలిపాడు. వీఆర్‌ఓ సేవలను అందరూ అభినందించారు.

5న అండర్-7,17 చెస్ క్రీడాకారుల ఎంపిక

- జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-7, 17 చెస్ పోటీలకు జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు ఈనెల 5వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి నగరంలోని రింగ్‌రోడ్ ప్రాంతంలో గల ఫైర్ చెస్ స్కూల్‌లో జరిగే ఎంపిక పోటీల్లో అండర్-7 విభాగంలో 2016 జనవరి 1వ తేదీ అనంతరం, అండర్-17 విభాగంలో 2006 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆ రోజు జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో కృష్ణా, అనకాపల్లి జిల్లాల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు విధిగా వారి వయస్సు ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకురావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ 94909 48730 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు

- విజేతలకు బహుమతుల ప్రదానం


పరుగు తీస్తున్న ఎద్దు


విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి తదితరులు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఎద్లు పరుగు ప్రదర్శన ఉత్సాహంగా జరిగింది. గ్రామంలోని రామాలయం తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా సర్పంచ్ చిన్నమ్ములు అప్పలనాయుడు, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శనలో 29 జతలు పాల్గొన్నాయి. విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన ఎడ్లు పాల్గొనగా వాటిలో మొదటిస్థానంలో అనకాపల్లి జిల్లాకు చెందిన చుక్కపల్లి రాజేష్ ఎడ్లు ప్రథమస్థానంలో నిలిచి రూ.25వేలు, రెండోస్థానంలో అదే జిల్లాకు చెందిన కె.మోహన్ ఎడ్లు రూ.20వేలు, మూడోస్థానంలో విజయనగరం జిల్లా వల్లంపూడికి చెందిన శానాపతి అప్పలరాజు ఎడ్లు రూ.18వేలు, నాల్గోస్థానంలో కూండ్రం గ్రామానికి చెందిన మరిడిమాంబ ఎడ్లు రూ.15వేలు, ఐదోస్థానంలో ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన నంబారు రాజుబాబు ఎడ్లు రూ.12వేలు, ఆరోస్థానంలో నిలిచిన కేఎల్‌బీ పట్నానికి చెందిన దుర్గా ప్రసాద్ ఎడ్లు రూ.10వేలు ఏడోస్థానంలో నిలిచిన నరసాపురానికి చెందిన సంపత్ వినాయక ఎడ్లు రూ.9వేలు, ఎనిమిదో స్థానంలో నిలిచిన అజనగిరికి చెందిన మరిడిమాంబ ఎడ్లు రూ.ఎనిమిదివేలు గెలుచుకున్నాయి. తర్వాత వరుస స్థానాల్లో నిలిచిన ఎం.కోటపాడు, వల్లంపూడి, లెక్కలవానిపాలెం, కేఎల్‌బీపట్నం, అజనగిరికి ఎడ్లుకు రూ.ఏడు వేలు, ఆరువేలు, ఐదువేలు, నాలుగువేలు, మూడువేలు, రెండువేలు, ఒకవెయ్యి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు, డీసీసీబి చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు,ఎస్‌కోట వైఎస్ ఎంపీపీ సుధారాజు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వర్రావు, పలుగ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.